ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 24 సెప్టెంబరు 2024



మహిళల భద్రత కోసమే 'షీ టీమ్'

సుల్తానాబాద్, సెప్టెంబరు 23: మహిళల భద్రత కసమే షీ టీమ్ పనిచేస్తుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని షీ టీమ్ ఇన్‌చార్జి మల్లయ్య అన్నారు. సుల్తానాబాద్‌లోని శ్రీవాణి కళాశాలలో సోమవారం షీ టీమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రతతో పాటు ఆన్‌లైన్ మోసాల గురించి యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రతీ రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాల్లో జన సమ్మర్ధం కల ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీమ్ నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే వెంటనే 6303923700 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ధాన్యం రవాణా టెండర్లు రసాభాస

- ఫారాలను బాక్సులో వేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్‌ను అడ్డుకోవడంతో వివాదం
- ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, చెదరగొట్టిన పోలీసులు
- చాకచక్యంగా కలెక్టర్‌కు టెండర్ ఫారాల అందజేత



ధాన్యం రవాణా టెండర్ల వద్ద గొడవకు దిగిన వారిని నివారిస్తున్న పోలీసులు

పెద్దపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రవా ణా టెండర్లు రసాభాసగా సాగాయి. టెండర్ ఫారాలను బాక్సులో వేసేందుకు కరీంనగర్ నుంచి వచ్చిన ఒక కాంట్రాక్టర్‌ను స్థానికులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొనడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టగా, టెండర్ ఫారాలను సదరు కాంట్రాక్టర్ చాకచక్యంగా ప్రజా వాణి కార్యక్రమంలో ఉన్న కలెక్టర్ వద్దకు వెళ్లి అంద జేశారు. ఈ వానాకాలం, వచ్చే యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఈ కేంద్రాల నుంచి సంబంధిత రైస్ మిల్లులను ధాన్యాన్ని రవాణా చేసేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖాధికారులు టెండర్లు నిర్వహించారు. పెద్దపల్లి, రామగుండం, మంథని, సుల్తానాబాద్ సెక్టార్లకు 15 రోజుల క్రితం టెండర్లు నిర్వహించగా సుల్తానాబాద్ మినహా మిగతా సెక్టార్లలో టెండర్లు ఓకే అయ్యాయి. సుల్తానాబాద్ సెక్టార్ నుంచి రామసీత ఎంటర్‌ప్రైజెస్, ఎస్ఆర్ ట్రాన్స్‌పోర్టు నుంచి రెండు టెండర్లు దాఖల య్యాయి. రామసీత ఎంటర్‌ప్రైజెస్ వారు తక్కువ ధరకు కోట్ చేయడంతో వారి టెండర్‌ను ఫైనల్ చేసే క్రమంలో ఎస్ఆర్ ట్రాన్స్‌పోర్టు యజమాని రామసీత కాంట్రాక్టర్‌పై అందులో లోపాలున్నాయని ఫిర్యాదు చేశారు. రామసీత కాంట్రాక్టర్ కూడా ఎస్ఆర్ కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ ఇద్దరి టెండర్లను అధికారులు సుల్తానాబాద్ సెక్టార్ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ కొత్తగా ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించి టెండర్ల దాఖలుకు సోమవారం సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించారు. ఆన్‌లైన్‌లో టెండర్ దాఖలు చేసి గడువు లోపు హార్డ్ కాపీని జిల్లా పౌరస రఫరాల శాఖ సంస్థ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. సోమవారం ఉదయం రామసీత ఎంటర్ ప్రైజెస్‌కు చెందిన కాంట్రాక్టర్లు టెండర్ ఫారాలను కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో గల పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో బాక్సులో వేసేందుకు రాగా, వారిని సుల్తానాబాద్, పెద్దపల్లి లారీ అసోసియేషన్‌కు చెందిన నాయకులు అడ్డుకు న్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగి ఘర్షణ వాతావరణం నెల కొన్నది. అధికారులు పరిస్థితిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి వారిని చెదర గొట్టారు. టెండర్ ఫారాలను బాక్సులో వేయకుండా అడ్డుకో వడంతో కింద ఆడిటోరి యంలో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుండగా అక్కడికి రామసేతు కాంట్రా క్టరు వెళ్లి కలెక్టర్‌కు టెండర్ ఫారాలను అందజేశారు. సాయంత్రం 5 గంటల వరకు గడువు ముగిసే వరకు సుల్తానాబాద్ సెక్టార్‌కు రామసీత ఎంటర్‌ప్రైజెస్, ఎస్ఆర్ ట్రాన్స్‌పోర్టు, సాయి హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేసి ఫారాలను బాక్సుల్లో వేశారు. ఇంతకుముందు రామగుండం సెక్టార్‌కు ఆన్ లైన్‌లో ఇద్దరు టెండర్లు దాఖలు చేయగా, వరంగల్ కాం ట్రాక్టర్ టెండర్ ఫారాలను తీసుకురాగా బాక్సులో వేయ కుండా రామ గుండం లారీ అసోసియేషన్ నాయ కులు అడ్డుకుని ఫారాలను లాక్కెళ్లారు. రామగుండం అనుభవం దృష్ట్యా అధికారులు ముందస్తుగా పోలీసులకు సమా చారం ఇచ్చి ఉంటే ఇంత వివాదం జరిగి ఉండేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అడ్డంకులు, గొడవల మధ్య ముగ్గురు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయగా, వాటిని ఈ నెల 24న అదనపు కలెక్టర్ (రెవె న్యూ) ఆధ్వ ర్యంలో ఓపెన్ చేసి తక్కువ ధర కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు ఖరారు చేయనున్నారు. గతంలో ఎప్పుడు కూడా ధాన్యం రవాణా టెండర్ల ప్రక్రియలో వివాదాలు జరగలేదు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 23: ప్రజా సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్క రించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీతో కలిసి కలిసి అర్జీల ను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి దరఖా స్తులను స్వీకరించి సంబంధిత శాఖలకు కేటాయించి ప్రజల సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా 27 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన పి ఉపేందర్ ఎస్సీ కార్పొరేషన్ కింద సబ్సిడీపై ఆటో మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. ఈడీ ఎస్సీ కార్పోరేషన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన ఎం మల్లారెడ్డి తన ఇంటిని దౌర్జన్యంగా కూలగొట్టి ఆక్రమించు కోవడానికి తనను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చట్టరీత్యాచర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. పెద్దపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌కు రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు.

రామగుండంలోని కృష్ణనగర్‌లో ఎ రాజేశం అనే వ్యక్తి ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గల్లీలో 30 అడుగు ల రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణం చేశాడని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ, రామగుండం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీంతో రామగుండం మున్సిపల్ కమిషనర్‌కు రాస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి మండలం హనుమంతునిపేట గ్రామానికి చెందిన ఎ లలిత తనకు 50 శాతం అంగవైకల్యం ఉందని, తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన ఎ బుచ్చమ్మ తమకు గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ రావడం లేదని, కరెంట్ బిల్లు కూడా అధికంగా వస్తుందని, గృహ జ్యోతి పథకం వర్తింపజేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ఎస్ఈ ట్రాన్స్‌కో అధికారికి రాస్తూ క్షేత్రసా యిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

నల్ల బ్యాడ్జీలతో టీబీజీకేఎస్ నాయకుల నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నాయకులు

సీఎంపీఎఫ్ కుంభకోణంపై సీబీఐ విచారణ జరపాలి

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

కాంట్రాక్టు కార్మికుల సంబరాలు

8

వరి పంటకు తెగులు.. అయోమయంలో రైతులు

- అవగాహన కల్పించని అధికారులు


నిట్టూరులో తెగులు సోకిన వరిపంట,


ఎండుతున్న వరిపంట

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 23: మండలంలోని వివిధ గ్రామాల్లో వరిపంటలకు తెగులు సోకి ఎండిపోతున్నాయి. పంటలకు తెగుళ్ల నివారణపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన అవగాహన సదస్సులు, పంటల వైపు పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మండ లంలోని నిట్టూరు గ్రామంలో సుమారు వంద ఎకరాలకుపైగా వరి పంటలో తెగు లు సోకి పచ్చటి వరిపంట ఎండిపోతున్నట్లు దర్శనమిస్తున్నాయి. దీంతో రైతులు పెస్టిసైడ్స్ దుకాణాలకు వెళ్లి పంటల గురించి తెలుపగానే వారికిష్టమైన పురుగు మందును రైతులకు అంటగడుతున్నారు. వాటిని పంటలపై పిచికారీ చేసినా తెగులు తగ్గడం లేదు. అధికారులు స్పందించి తెగులు నివారణ కోసం ప్రత్యేక సమావేశం, పంటలసందర్శన నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తాం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ముత్తారం, సెప్టెంబరు 23: మండలంలోని చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ముత్తారం మండలం ఖమ్మంపల్లి, రామయ్యపల్లె, జిల్లెళ్లపల్లె గ్రామాల రైతుల పొలాలకు నీరు అందించాలని ఐటీ, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుని కోరారు. దీంతో తక్షణమే ఇరిగేషన్ ఎస్ఈకి ఫోన్లో సంప్రదించి ఆర్ఈ డి కెనాల్‌కు నీటి విడుదల చేయాలని కోరగా సానుకూలంగా స్పందించిన ఎస్ఈ నీటిని విడుదల చేస్తామని తెలిపారు. అనంతరం ముత్తారం మండల రైతులు మరియు కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, ముత్తారం మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 23: జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కమాన్‌పూర్, పెద్దపల్లి మండలాల పరిధిలోని గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పంప్ ఆపరేటర్ల సహాయకులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శిక్షణ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ అరుణ శ్రీ హజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అరుణ శ్రీ మాట్లాడుతూ శిక్షణలో ప్రతి ఒక్కరూ బోర్‌పంప్‌ల మరమ్మత్తులు, పైప్ లైన్ లీకేజీల విషయంలో గ్రామస్థాయిలోనే సమస్యను పరిష్కరించాలని సూచించారు.ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు సమస్యలు ఉంటే సత్వరమే పరిష్కరించేందుకు గాను శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, డిఈ సతీష్, పెద్దపల్లి ఎంపీడీఓ ఘనుకోట శ్రీధర్, ఏఈ మధు, ఎంపీవో ఫయాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మౌలిక వసతులకల్పనకు తొలి ప్రాధాన్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ రమాసురేష్‌రెడ్డి



పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పెంద్రి రమ

మంథని, సెప్టెంబరు 23: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యం ఇచ్చి పని చేస్తామని చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం ప్రహారీ నిర్మాణ పనులను చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్ కృషల్ ఫండ్ బ్యాలెన్స్ ద్వారా రూ. 36 లక్షల నిధులతో ప్రహారీ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. అన్ని వార్డుల్లో, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించామన్నారు. ప్రత్యేక నిధులతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఇంకా అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పన కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సూపరింటెండెంట్ మనోహర్, ఏఈ షాహాభాజ్, మంథని సత్యం పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి: మేయర్


సమీక్ష సమావేశంలో పాల్గొన్న మేయర్, ఆస్పత్రి అధికారులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 23: రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలందించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, మేయర్ బంగి అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఓపీ పెరిగిందని, వైద్యులు ఓపికగా సమన్వయం పాటిస్తూ రోగులకు వైద్యం అందించాలని సూచించారు. పనివేళల్లో వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించడం లేదని, అనధికారికంగా విధులకు గైర్హాజర్ అవుతున్నారన్నారు. వైద్యులు తప్పనిసరిగా విధులు హాజరుకావాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమపై పనిభారం పడుతుందని, చాలా మంది విధులకు హాజరుకాకపోవడంతో ఒత్తిడి పెరుగుతుందని వైద్యులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. వైద్యులు రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతానని వైద్యులకు హామీ ఇచ్చారు. సమావేశంలో సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్ఎంఓలు అప్పారావు, చంద్రశేఖర్, అశోక్‌కుమార్, హెచ్‌వోడీలు అశోక్, అరుణ, సుధామణి పాల్గొన్నారు.

● సమావేశానికి హాజరుకాని హెచ్‌వోడీలు...

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఉందని, ఈ సమావేశానికి ఆయా విభాగాల అధిపతులు హాజరుకావాలని మూడు రోజుల క్రితం మేయర్ బంగి అనిల్ కుమార్ ఆహ్వానం పంపారు. అయిననప్పటికీ హెచ్‌వోడీలు ఈ సమావేశానికి కొందరు హాజరుకాలేదు. 13 మంది ఆయా విభాగాల అధిపతులు ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. దీనిపై మేయర్ మండిపడ్డారు. ఆసుపత్రి కమిటీ సభ్యుడైన తనను అవమానించారని, రోగులకు అందాల్సిన వైద్య సేవలపై సమావేశం నిర్వహిస్తే గైర్హాజర్ అవుతారా అని మండిపడ్డారు. హెచ్‌వోడీల తీరు బాగా లేదని వారు తమ పద్ధతులను మార్చుకోవాలని మేయర్ హెచ్చరించారు.

బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభం

ఓదెల, సెప్టెంబరు 23: మండల వ్యాప్తంగా సోమవారం నుంచి బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి 9 రోజుల పాటు బొడ్డెమ్మ వేడుకలు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో ఓదెలతో పాటు పలు గ్రామాల్లో బొడ్డెమ్మను ప్రతిష్ఠించి ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు. తొమ్మిది రోజులు అనంతరం ఎంగిలిపూల బతుమ్మ వేడుకలు ప్రారంభం కానున్నాయి.


ఓదెలలో బొడ్డెమ్మను ఆడుతున్న మహిళలు

ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

మంథని, సెప్టెంబరు 23: రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారించాలని సీపీఎం నేత ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. సోమవారం జరిగిన మంథనిలో సీపీఎం మంథని శాఖ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతిచెందిన సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ప్రజాసమస్యలపై దృష్టి పెట్టలేద న్నారు. సామాన్య ప్రజలు, కార్మికులు, విద్యార్థులు, యువత అనేక సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. రైతులకు రుణమాఫీ జరగక బ్యాంకుల చుట్టూ తిరుగు తున్నారన్నారు. కౌలు రైతులను పట్టించుకో వడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బూడిద గణేష్, ఆర్ల సందీప్, ఏల్పుల సురేష్, బీ. రవి, గొరింకల సురేష్‌మౌర్య, ఎ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని ధర్నా

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 23: రామగుండం మండల వాసులు తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కే టాయించాలని కలెక్టరెట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ శ్రీకోయ హర్షకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఏడాది వేలాది మంది పేదలు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నామన్నారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో డ్రా పద్ధతిన 660 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. ఏడాది గడుస్తున్నా ఇంకా డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించలేదన్నారు. పెద్దపల్లి పట్టణంలో డ్రా పద్ధతిన ఎంపిక చేసిన వారికి ఇళ్లు కేటాంచారని వారు పేర్కొన్నారు. తమకు ఇళ్లు కేటా యించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సుమారు రెండు వందల మంది లబ్ధిదారు లు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రామగుండం మండల వాసులు



మరమ్మతులు కరువు

● ఫ్లోరింగ్ కుంగి.. గుంతలు పడ్డ స్త్రీశక్తి, ఉపాధిహామీ భవనం
● మరమ్మతులు చేయాలని మహిళల వినతి


ఉపాధిహామీ భవనంలో కుంగిన ఫ్లోరింగ్


స్త్రీశక్తి భవనంలో లేచిన బండలు


సైదాపూర్ స్త్రీశక్తి, ఉపాధిహామీ భవనం

సైదాపూర్, సెప్టెంబరు 18: సైదాపూర్ మండల కేంద్రంలో ఐకేపీ సిబ్బందికి, ఉపాధిహామీ సిబ్బందికి కలిపి ఒకే చోట 2011వ సంవత్సరంలో భవనం నిర్మించారు. 2016 నవంబరు 26న అప్పటి రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభించి బిల్డింగ్‌ను ఉపాధిహామీ, ఐకేపీ అధికారులకు అప్పగించారు. కానీ ఆ భవణం సంవత్సరం గడువక ముందే ఫ్లోరింగ్ కుంగి బండలు లేచి గుంతలు ఏర్పడ్డాయి. గోడలు పగుళ్లు చూపాయి. పాములు తేళ్లు స్వైర విహారం చేస్తున్నాయి. అయినప్పటికి అప్పటి నుంచి ఆ బిల్డింగ్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు అధికారులు. మరమ్మతులు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక మహిళలు ప్రతి రోజు వచ్చే స్త్రీ శక్తి భవణం వద్ద సరైన మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పై అధికారులు, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి స్త్రీశక్తి, ఉపాధిహామీ బిల్డింగ్ ఫ్లోరింగ్ మరమ్మతులు చేయాలని మహిళలు, ఉపాధిహామి, ఐకేపీ సిబ్బంది కోరుతున్నారు.

పేదరిక నిర్మూళన సంస్థ ద్వారా మహిళలకు, ఉపాధిహామీ ద్వారా వారి సిబ్బందికి నిత్యం ఏదో ఒక సమావేశం జరుగుతూనే ఉంటుంది. ఈ భవణాలు ఎప్పుడు రద్దీగా కనిపిస్తాయి. అలాంటి భవణాల్లో ఫ్లోరింగ్ గుంగడంతో, బండలు లేవడంతో మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

● విష పురుగులు స్వైర విహారం

స్త్రీశక్తి, ఉపాధిహామీ రెండు భవణాల్లో ఫ్లోరింగ్ కుంగడం, గోడలు పగలడంతో పాములు, తేళ్ల వంటి విషపురుగులు స్వైర విహారం చేస్తున్నాయి. ఒక రోజు ఏపీఎం టేబుల్ డ్రాలో పాము దూరింది. అటెండర్ టేబులు తూడిచేందుకు వెళ్లగా పాము బయటకు వచ్చిందని, దాంతో అటెండర్ బయపడి పరుగెత్తడంతో కింద పడిపోగా దెబ్బతగిలిందని సిబ్బంది తెలిపారు. అంతే గాక ఇంకొక రోజు దర్వాజపై పాము పడుకోవడంతో మహిళలు పామును చూసి పరుగులు తీశారని, వెంటనే కొందరు సిబ్బంది పామును చంపి వేశారని తెలిపారు. ఇంకో రోజు నీటి సంపులో పడి పాము చనిపోయిందన్నారు. ఈ కార్యాలయాలకు రావాలంటే భయం వేస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మరమ్మతులు కరువు

లక్షలు వెచ్చించి భవణాలు నిర్మించారు కానీ మరమ్మతు చేయడానికి వెనుకాడుతున్నారని, చర్యలు తీసుకోవడం లేదని మహిళా సంఘాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టించుకోవాలని కోరుతున్నారు.

ఇక్కడకు రావాలంటే భయమేస్తుంది
- సమ్ము రజిత, సంతోషిమాత మండల సమైక్య అధ్యక్షురాలు, సైదాపూర్



స్త్రీ శక్తి భవనం ఫ్లోరింగ్ కుంగిపోవడం, ఫ్లోరింగ్ బండలు లేవడం, గోడలు పగుళ్లతో ఇక్కడికి రావాలంటేనే భయం వేస్తోంది. అంతేగాక పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. వెంటనే ఫ్లోరింగ్ మరమ్మతుతో పాటు మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కల్పించాలి.

చెయ్యి విరగడంతో ఇబ్బంది పడుతున్నా
- వెంకటేష్, అటెండర్, ఐకేపీ సైదాపూర్



మాది పేద కుటుంబం. ఐకేపీలో అటెండర్‌గా పని చేస్తున్నా. చాలా సార్లు బండలు తట్టుకొని కింద పడ్డాను. చిన్న చిన్న దెబ్బలతో సర్దుకపోయాను. ఏపీఎం రూం వద్ద బండ తట్టుకొని పడడంతో చెయ్యి విరిగింది. విరిగిన చెయ్యితో ఇబ్బందిగా ఉంది. ఏ పని చేసుకోలేక పోతున్నా.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

ఎలిగేడు, సెప్టెంబరు 23: మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన రంగు కొంరయ్య(51)అనే గీతకార్మికుడు సోమవారం సాయంత్రం తాటిచెట్టు పైనుంచి మోకు జారీ గాయాలపాలయ్యాడు. వృత్తిరీత్యా తాటికళ్లు తీయడానికి కొంరయ్య చెట్టుపైకి వెళ్లాడు. దిగే క్రమంలో మోకుజారి కిందపడ్డాడు. దీనితో అతనికి కాలు, వెన్నుముకకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుప్రతికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మహిళ అదృశ్యం

జ్యోతినగర్, సెప్టెంబర్ 23: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీకే రామయ్య కాలనీకి చెందిన శ్యామల(35) అనే మహిళ కనిపించడం లేదు. కొన్ని నెలలుగా భర్త సంతోష్‌తో దూరంగా ఉంటున్న శ్యామల పీకే రామయ్య కాలనీలో ఉంటుంది. ఈ క్రమంలో భార్య శ్యామల వద్దకు భర్త సంతోష్ వచ్చి గొడవ చేశాడు. ఆ తర్వాత ఇంట్లో నుంచి వెళ్లిపోయిన శ్యామల ఇంటికి తిరిగి రాలేదు. శ్యామల తండ్రి రాజకొమరయ్య తన కూతురు కనిపించడం లేదని ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

చొప్పదండి, సెప్టెంబరు 23: చొప్పదండి పట్టణ కేంద్రంలోని బ్రాహ్మణకుంట శిఖం భూమికి తప్పుడు నివేదికలను ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్‌లు సుధాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌కు ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఫిర్యాదు చేశారు. బ్రాహ్మణకుంట కుంట శిఖం భూమి యధేచ్ఛగా కబ్జాకు గురవుతుందని డీఈ, ఈఈలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదదని ఆయన పేర్కొన్నారు. అధికారులు సమగ్ర విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తప్పులు చేసే అధికారులపై చర్యలు చేపట్టి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని వారు పేర్కొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న కేంద్రం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 23: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీవుల్లా ఖాద్రి అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోదీ పదేళ్ల క్రితం అధికారంలోకి రాక ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందన్నారు. దేశంలో 16శాతం నిరుద్యోగం ఉన్నదని, చదువుకు తగ్గట్టు ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అక్టోబరు 27, 28తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహించే ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు లింగం రవి, పంజాల శ్రీనివాస్, మానస్‌కుమార్, మార్కపురి సూర్య, కనకరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ వలీవుల్లా ఖాద్రి

మందుబాబులకు జరిమానా


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ రాజు

వేములవాడ, సెప్టెంబర్ 23 : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 71 మందికి వేములవాడ న్యాయస్థానం జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ ఆర్.రాజు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సందర్భంగా పట్టుబడిన 71 మందిని న్యాయమూర్తి జ్యోతిర్మయి ఎదుట ప్రవేశపెట్టామని, వీరిలో ఇద్దరికి రూ. 3500 రూపాయల చొప్పున, 20 మందికి 2500 రూపాయల చొప్పున, మిగతా జరిమానా 51 మందికి 1500 రూపాయల చొప్పున జరిమానా విధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారికి పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు


చందుర్తి, సెప్టెంబర్ 23: చందుర్తి మండల కేంద్రంకు చెందిన ఓ యువకుడిని దూషించిన సంఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాబు సోమవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మర్రి రమేష్ అనే యువకుడు ఇంటి నిర్మాణం కోసం తీసుకు వచ్చిన ఇసుకతో పాటు ఇతర సామగ్రి ఆరుబయట నిల్వ చేశాడు.

ఈ క్రమంలో శనివారం రాత్రి పోతరాజు రవి అనే వ్యక్తి ఇసుక తొలగించాలని రమేష్‌ను దూషిస్తూ పాటు గొడ్డలి పట్టుకొని వెళ్లగా రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాబు తెలిపారు.

గురుకుల సమస్యలు పరిష్కరించాలి

తిమ్మాపూర్, సెప్టెంబరు 23: గురుకుల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను జిల్లా యూటీఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పరిధిలోని 700లకు పైగా గురుకులాలు అద్దె భవనాలలో అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్నాయని అన్నారు. అశాస్త్రీయమైన పాఠశాల పనివేళలు సవరించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. గురుకుల ఉపాధ్యాయుల విద్యార్థుల ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో టీఎస్ యుటీఎఫ్, గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆశలవారీగా అందోళన కార్యక్రమాలు చేపడుతామని దీనిలో భాగంగా ఈనెల 28న హైదారాబాద్‌లో గురుకుల ఉపాధ్యాయులతో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు ముల్కల కుమార్, సెక్రటరీ జావీద్, నాయకులు భూపేందర్ కౌర్, తిరుపతి, స్వామి, శ్రీనివాస్, రత్నాకర్ పాల్గొన్నారు.









బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి జైలు శిక్ష

వీణవంక, సెప్టెంబర్ 23: మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన జున్నుతుల మనోహర్‌రెడ్డి 2003లో టాక్టర్‌ను అజాగ్రత్తగా నడిపి బోల్తాపడటంతో అందులో ప్రయాణిస్తున్న జున్నుతుల రాజేశ్వర్‌రెడ్డి(9) అనే బాలుడికి గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా జున్నుతుల శ్రీనివాస్‌రెడ్డి, జున్నుతుల రాజేశ్వరమ్మ, చదువు శ్రీనివాస్‌రెడ్డి, చదువు వీరారెడ్డిలకు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరస్తుడిని కోర్టులో ప్రవేశపెట్టగా హుజూరాబాద్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ జున్నుతుల మనోహర్‌రెడ్డికి 19 నెలల జైలు శిక్షతో పాటు 6,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా కోర్టు హెడ్ కానిస్టేబుల్ పంతంగి శ్రీనివాస్,ఎస్‌ఐ తోట తిరుపతి, జమ్మికుంట రూరల్ సీఐ కోరే కిషోర్‌లను ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు.

ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్ నిలిపివేయాలి

శంకరపట్నం, సెప్టెంబరు 23: ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్ నిలిపివేయాలని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ హనుమకొండ కార్యాలయంలో శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ ఎక్స్‌ప్రెస్ విద్యుత్ లైన్‌తో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అధికారులకు విన్నవించినట్లు పేర్కొన్నారు. ఇళ్ల పక్క నుంచే విద్యుత్ లైన్ వేయవద్దని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. పనులు వెంటనే నిలిపివేయాలని సీఎండీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కమర్షియల్ విద్యుత్ లైను ఊరు బయట నుంచి తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

గంగాధర, సెప్టెంబరు 23: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితుడికి అందించినట్లు ఎస్‌ఐ నరేందర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంగాధర గ్రామానికి చెందిన మల్యాల రాజేందర్ తన వీవో 23 మొబైల్ ఈనెల 18 పోగొ ట్టుకున్నాడు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సోమవారం అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఐటీయూ సంఘర్షణ యాత్ర

వీణవంక, సెప్టెంబర్ 23: రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియూ అధ్వర్యంలో సంఘర్షణ యాత్ర చేపట్టారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ న్యాయ సంహిత చట్టం 106 రద్దు చేయాలన్నారు. జీవన భృతి 4500 కల్పించాలని డీజిల్,పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు పుణ్ణం,చెలికాని శ్రీనివాస్,పిల్లి రవి యాదవ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు



కప్‌ను అందుకుంటున్న విజేత మెదక్ బాలుర జట్టు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 23 : రాజ మూడు రోజులపాటు నిర్వహించిన 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్ బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. టోర్నీలో మెదక్(బాలుర), నిజామాబాద్ (బాలికల)జట్లు విజయం సాధించాయి. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సెమీ ఫైనల్స్, ఫైనల్స్ 'నువ్వానేనా' అన్నట్లుగా జట్లు పోటీపడ్డాయి. ఫైనల్స్‌లో మెదక్, నిజా మాబాద్ బాలుర జట్లు తలపడగా మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ బాలికల జట్లు తలపడగా నిజామాబాద్ జట్టు గెలిచాయి. శనివారం సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానం, బతుకమ్మ ఘాట్ సమీపంలోని మైదానంలో టోర్నీ ప్రారంభించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి 19 బాలికలు, 19 బాలుర జట్లు తలపడ్డాయి. విజేతలకు డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా ఆటల్లో రాణించాలన్నారు. సాఫ్ట్ బాల్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శోభన్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అంజయ్య ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి అర్చన, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్రనాయకుడు లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్‌నకు యత్నం

చందుర్తి, సెప్టెంబరు 23 : చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి శివారులో 13ఏళ్ల బాలికను సోమవారం యువకుడు కిడ్నాప్ చేసేందుకు యత్రించాడు. బాలిక కుటుంబ సభ్యుల రాకతో సదరు యువకుడు మరో యువకుడితో కలిసి కారులో పరారయ్యాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలంలోని బొల్లెం చెరువు గ్రామానికి చెందిన సతీష్ అనే యువకుడు చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలో కూలీ పని చేస్తు న్నాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని తిమ్మాపూర్‌కు చెందిన బాలికను ఏడాదిగా వేధి స్తున్నాడు. సోమవారం ఉదయం బాలిక పాఠశాలకు వెళ్తుండగా ఆశిరెడ్డిపల్లి శివారులో మరో యువకుడితో కారులో వచ్చిన సతీష్ బాలికను పెళ్లి చేసుకోవాలని, లేకపోతే చంపేస్తానంటూ కొట్టి, బెదిరించాడు. కిడ్నాప్ చేసేందుకు యత్నించాడు. బాలిక ఒక్కసారిగా కేకలు వేయడంతో అటువైపు వచ్చిన ఓ యువకుడు గమనించి బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా యువకుడు కారులో పరారయ్యాడు. ఈ సంఘటనపై బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాబు తెలిపారు.

పంట పొలాలపై కోతుల దాడులు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు
- జనాలపై పెరుగుతున్న దాడులు
- బెంబేలెత్తుతున్న ప్రజలు



కమ్మరిపేటలో కోతుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

భీమారం, సెప్టెంబరు 23 : భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఆయా పంట పొలాలపై కోతులు దాడులు పెరుగుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటల్లో కోతులు దాడి చేయడంతో రైతులు నష్టాలపాలవుతున్నారు. కొందరు రైతులు కోతుల బెడద కారణంగా చిరుధాన్యాలు, కూరగాయలు పండించడం మానివేస్తున్నారు. భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని కమ్మరిపేట, వెంకట్రావుపేట, రాగోజీపేట, దేశాయిపేట, గోవిందాం, పసునూరు, మన్నెగూడెం గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని సైతం వరి గింజలు వలుచుకొని తినడంతో రైతులు అధికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో కోతుల బెడద కారణంగా అన్నదాతలు చిరుధాన్యాలు, కూరగాయలు పండించడానికి కష్టాలు పడుతున్నారు. గత్యంతరంలేక వరిధాన్యం పండిస్తున్నారు.

జనాలపై పెరుగుతున్న దాడులు

గ్రామాల్లోని ఇళ్లల్లోకి కోతులు చొరబడి తినుబండారాలు, వివిధ వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. అడ్డు వచ్చిన జనాలపై తిరగబడి దాడి చేస్తూ గాయాల పాలు చేస్తున్నాయి. అలాగే ఇళ్ల పైకప్పు పెంకులను పూర్తిగా ధ్వంసం చేస్తున్నారు. కిరాణ దుకాణ యాజమానులు దుకాణం ముందు గ్రిల్స్, రక్షణ వలయాలను ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒంటరిగా ఉన్న వృద్ధులు, చిన్నారులపై దాడిచేసి గాయపరిచిన సంఘటనలు అనేకం.

కోతుల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రతి రోజు రైతులు తమ పంట పొలాలను కాపాడుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ పొలాలను కాపాడుకోవడానికి విడతలవారీగా కాపలా కాస్తున్నారు. కొందరు రైతులు కుక్కలను వేలాది రూపాయలు వెచ్చించి తమ పంట పొలాల వద్ద కాపలాగా ఉంచుతున్నారు. మరికొందరు వానరాలను తరిమేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో వందల ఎకరాల్లో జామ, మామిడి మొక్కలు ఉండేవి. కోతుల బెడద కారణంగా ఇవి ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయాయి. కోతుల నుంచి మమ్మల్ని కాపాడాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

చేనులో కాపలా కాస్తున్నాం..

మేము నలుగురం. మా మొక్కజొన్న చేనులో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలా కాస్తున్నాం. ఎవరైనా భోజనం చేయడానికి ఇంటికి వెళ్తే కోతులు చొరబడి నష్టం కలుగజేస్తున్నాయి. ప్రభుత్వం మాకు సోలార్ ఫైల్డ్ ఫెన్సింగ్ ఇప్పిస్తే మున్ముందు పంటలు వేస్తాం. లేదంటే వేయలేం.



- చెట్లపల్లి లింగారెడ్డి, రైతు

కోతుల బెడదతో మొక్కజొన్న వేయడం లేదు..

గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో మూడేళ్ల నుంచి మొక్క జొన్న పంట వేయడం లేదు. మూడు సంవత్సరాల క్రితం మొక్కజొన్న పంట వేస్తే ఒక్క సంచి కంకి కూడా ఇంటికి తీసుకుపోలేదు. ప్రభుత్వం కోతుల నుంచి రక్షణ కల్పించినట్లయితే మళ్లీ మొక్కజొన్న పంట వేస్తాను.



- చింతలపల్లి వెంకట రెడ్డి, రైతు, భీమారం

క్రైం కార్నర్

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 23 : మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన కేసులో ఒకరికి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ సోమవారం తీర్పు వెలువరించారు. పాత గూడూరు గ్రామానికి చెందిన కొరవేని పెద్దిరాజు అతిగా మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రామచంద్రంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని కోరారు.

విద్యుత్ మోటార్ల చోరీ

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 23 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని 10వ వార్డులో ఉన్న లింగంపేటలో వరుసగా విద్యుత్ మోటార్లు చోరీకి గురి కావడంతో రైతులు ఆందోళనకు గురువుతున్నారు. వరుసగా మూడు రోజులుగా ద్యాగల లక్ష్మీరాజం, ఎడమల సహదేవ్, బుయ్య కిషన్‌లకు చెందిన విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితులు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వీణవంకలో దొంగల హల్‌చల్

● రెండు దుకాణాల్లో చోరీ



ఐరన్ షాపులో ధ్వంసం చేసిన సీసీ కెమెరాలు

వీణవంక సెప్టెంబర్ 23 : మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఎలక్ట్రికల్ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ షాప్‌తో పాటు నల్ల పోచమ్మ షాప్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. షట్టర్స్ పగులగొట్టి రెండు షాపుల్లో చొరబడిన దొంగలు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ఐరన్ షాపులో దాదాపు 14వేల రూపాయల నగదు చోరీ చేసి షాప్‌లోని పలు సామాన్లు ధ్వంసం చేశారు. నల్ల పోచమ్మ వైన్‌షాప్‌లో 35 వేల విలువైన మద్యం బాటిళ్ల చోరీ చేశారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి హార్డ్‌డిస్క్‌లు ఎత్తుకెళ్లారు. వైన్స్ షాప్ యజమాని దాసం రఘుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తోట తిరుపతి తెలిపారు.

అడవి జంతువుల దాడిలో వరి పంట ధ్వంసం



అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి పంట

కోనరావుపేట, సెప్టెంబరు 23 : కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామ శివారులో అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసమైంది. గ్రామానికి చెందిన మారుపాక లింగయ్య అనే రైతుకు చెందిన రెండు ఎకరాల వరి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. కోతకు వచ్చే సమయంలో పంటను ధ్వంసం చేశాయని బాధిత రైతు తెలిపాడు. అటవీశాఖ అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలని కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 : కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రియదర్శిని కాలనీకి చెందిన జేరుపోతుల అంజనేయులు(45) మృతి చెందాడని కరీంనగర్‌రూరల్ పోలీసులు తెలిపారు. అంజనేయులు దుర్శేడ్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకవైపు నుంచి ఒక కారు అతివేగంగా ఢీకొనగా తల, ఇతరచోట్ల తీవ్ర గాయాలయ్యాయని, స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా మృతుడి కళ్లను సోమవారం కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది ఆంజనేయులు నేత్రాలను సేకరించి ఆసుపత్రికి తరలించారు.

కోరుట్లలో..

కోరుట్ల, సెప్టెంబరు 23 : పట్టణంలోని జీఎస్ గార్డెన్ సమీపంలోని జాతీయ రహ దారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎసీకోని గుట్ట ప్రాంతానికి చెందిన పెంట మక్కయ్య (47) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మక్కయ్య ఎసీకోని గుట్ట ప్రాంతం నుంచి కోరుట్లకు టీవీఎస్ ఎక్సెల్ (ఏపీ 15 ఎక్స్ 2518) నంబర్‌గల ద్విచక్ర వాహనంపై వస్తుండగా జీఎస్ గార్డెన్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు పట్టణంలోని ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. మార్గ మధ్యలో మక్కయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెర్కొన్నాడు.

భవన నిర్మాణ కార్మికుడి..

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 23 : మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన బోమ్మ రవి(46) అను భవన నిర్మాణ కార్మికుడు సోమవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రవి భవన నిర్మాణ కార్మికుడిగా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 18న మెట్‌పల్లి పట్టణంలో పనులు ముగిసించుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో మెట్ల చిట్టాపూర్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కుక్కను ఢీకొని కింద పడ్డాడు. దీంతో రవి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలపడంతో మెట్‌పల్లి ఆసపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం నిజామాబాద్‌కు తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో సోమవారం ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో మార్గ మధ్యలోనే మృతి చెందాడు. రవి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 14,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 14,170 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

30లోగా బీఎస్సీ ఆనర్స్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 23: ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ (డిజైన్ టెక్నాలజీ) నాలుగో సెమిస్టర్ విద్యార్థులు సెప్టెంబర్ 30వ తేదీలోగా పరీక్ష రుసుం చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో అక్టోబర్ నాలు గో తేదీ వరకు చెల్లించాలన్నారు. పరీక్షలు అక్టోబర్‌లో నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ .. యువకుడి మృతి

ధర్మారం, సెప్టెంబరు 23 : మండలంలోని దొంగతుర్తి గ్రామానికి చెందిన కూనారపు లక్ష్మణ్(36) అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని సంవత్సరాల నుంచి లక్ష్మణ్ మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో తాగిన మత్తులో ఈనెల 19న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు లక్ష్మణ్ భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

● కాగా కూనారపు లక్ష్మణ్ గడ్డి మందు తాగడం వల్లనే మృతి చెందాడని అతడి కుటుంబ సభ్యులు పురుగుల మందు దుకాణం ఎదుట మృతదేహంతో ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను అడ్డుకుని విరమింపజేశారు.

చెట్టుకు ఢీకొన్న బైక్..

సుల్తానాబాద్, సెప్టెంబర్ 23 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టగా ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన శ్యామల రాజు, స్వరూప దంపతులు జీవనోపాధి కోసం పెద్దపల్లి వచ్చి స్థిరపడ్డారు. ఆదివారం వెదిరలో కుల సంఘం సమావేశం కోసం రాజు (30) తన ద్విచక్ర వాహనంపై వెదిర వెళ్లి అదే రోజు రాత్రి తిరిగి పెద్దపల్లి వస్తున్నాడు. మార్గమధ్యలో సుల్తానాబాద్ బస్టాండ్ మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు రాజు భార్య స్వరూప సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 23 :కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఒకరు పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడలో సోమవారం చోటు చేసుకుంది. పట్టణంలోని చింతకుంట వాడకు చెందిన బొల్లారపు శివ ప్రసాద్ అనే వ్యక్తికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని రోజులుగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన శివ ప్రసాద్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 : అనారోగ్యంతో బాధపడుతూ మునిగాల శ్రీనివాస్(50) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి నట్లు ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కొంతకాలంగా ఒళ్లునొప్పులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న సిక్‌వాడిలో నివాసం ఉంటున్న ముని గాల శ్రీనివాస్ ఆదివారం అర్ధరాత్రి ఇంటిలో పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

● 200 గ్రాముల గంజాయి స్వాధీనం ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమామహేశ్వరరావు



వివరాలు వెల్లడిస్తున్న మెట్‌పల్లి డిఎస్పీ ఉమామహేశ్వరరావు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు23 : దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగలను ఇబ్రహీంపట్నం పోలీసులు 48 గంటలలో పట్టుకుని జైలుకు పంపారు. దొంగతనాలకు అలవాటు పడి దారి దోపిడీతో పాటు గంజాయి అమ్ముతున్న యువకులను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న రాత్రి కమ్మర్‌పల్లి మండలంలో ఉప్లూర్ గ్రామానికి చెందిన సుధాగోని గంగాధర్‌గౌడ్ తన వ్యానులో ఆర్మూర్ నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తుండగా బండలింగపూర్ క్రాస్ రోడ్డువద్ద మూత్ర విసర్జన చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు గంగాధర్‌గౌడ్ వద్దకు వచ్చి దాడి చేసి తన వద్ద ఉన్న 5 వేల రూపాయలతో పాటు సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం ఇ బ్రహీంపట్నం క్రాస్ రోడ్డు వద్ద అనుమానస్పదంగా బైక్‌పై వస్తున్న ముగ్గురిని ఆపి విచారించగా చోరీకి పాల్పడినట్లు తెలిపారు. అలాగే బైక్‌లో తరలిస్తున్న 200 గ్రాములు గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వారిలో మేడిపల్లి గ్రామానికి చెందిన ఏనుగు వంశీ, మెట్‌పల్లి మఠం వాడకు చెందిన బైండ్ల వేణు, బండలింపూర్ గ్రామానికి చెందిన కైర వేంకటేష్‌లను అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి బైకు, డబ్బు, సెల్‌ఫోన్, గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి రి మాండ్‌కు తరలించినట్లు తెలిపారు.. నిందితులను పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ కుమార్, కిరణ్ కుమార్‌లను సిబ్బంది గంగాధర్, చైతన్యలను మెట్‌పల్లి డీఎస్పీ అభినందించారు.

జనావాసాల్లోకి కొండచిలువ



బకెట్‌లో ఉన్న కొండచిలువ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 23 : ఎల్లారెడ్డిపేట మండలం పదిర శివారులోని జనావాసాల్లోకి ఆదివారం రాత్రి కొండ చిలువ రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. భారీ కొండచిలువను చూసి కేకలు వేస్తూ పరుగులు పెట్టారు. ఓ యువకుడు 100 నంబర్‌కు డయల్ చేసి విషయాన్ని చెప్పాడు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు పాములు పట్టే వ్యక్తిని పిలిపించారు. సుమారు 2.30 గంటలపాటు శ్రమించి బకెట్ సహాయంతో కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం హరిదాస్‌నగర్ శివారులోని అటవీ ప్రాంతంలో కొండచిలువను వదిలి పెట్టినట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు.

భూవివాదాల్లో ఎస్ఐపై సీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 : భూ వివాదాల్లో తలదూర్చి డబ్బులు తీసుకుని పంచాయితీలు చేసేవాడని ఒక ఎస్ఐపై సోమవారం పోలీస్ కమిషనర్‌కు సైదాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన భూ బాధితులు ఫిర్యాదు చేశారు. సైదాపూర్ మండల ఎస్ఐగా పనిచేసిన సమయంలో భూ దందాలపై డబ్బులు ఎక్కువ ఇచ్చిన వారికి మద్దతుగా ఉంటూ, నిజమైన భూ యజమానులకు అన్యాయం చేశాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటికి వచ్చి ఎస్ఐ బెదిరించినట్లు సీసీ కెమెరా ఆధారాలను కూడా సీపీకి అందజేశామని బాధితులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23: కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సంధ్య అనే మహిళ మానేరు జలాశయంలో టూరిస్ట్ బోట్‌లో టికెట్ తీసుకుని బోట్ రైడింగ్‌కు వెళ్లింది. బోట్ కొద్దిదూరం వరకు వెళ్లగానే వివాహిత ఒక్కసారిగా నీటిలోకి దూకింది. గమనించిన బోట్ డ్రైవర్, తోటి ప్రయాణికులు వెంటనే మహిళను రక్షించారు. అనంతరం లేక్ పోలీసులకు సమాచారం అందించారు. సదరు మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఏటీఎం దొంగల అరెస్టు



దొంగలు ఉపయోగించిన క్లిప్‌లు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23: ఏటీఎం మిషన్‌లో నగదు బయటకు వచ్చే చోట స్టీల్ ప్లేట్ లను అమర్చి ఖాతాదారులకు డబ్బులు కనిపించకుండా చేసి కొద్దిసేపటి తర్వాత ఆ డబ్బులను తీసుకుని మోసాలకు పాల్పడు తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠాకు చెందిన ఇద్దరు నింది తులను కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ ఆధ్వ ర్యంలో పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రోహిత్ పాల్, సత్యవీర్ సింగ్ అనే ఇద్దరు నేరస్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. హుజూరా బాద్‌కు చెందిన పేరుమల్ల భిక్షపతి ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లోని తారక్ హోటల్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో 10 వేల రూపాయలు డ్రా చేసేందుకు తన ఏటీఎం కార్డును పెట్టి పిన్ నంబర్ ఎంటర్ చేసిన తర్వాత డబ్బులు రాకపోయేసరికి అతను వెళ్ళిపోయాడు. అప్పటికే ఇద్దరు వ్యక్తులు ఏటీఎంలో అనుమానాస్పదంగా కనిపించారు. ఆ తరువాత కొద్దిసేపటికి 10వేలు డ్రా అయినట్లుగా భిక్షపతికి మెస్సేజ్ వచ్చింది. అనుమానంతో బాధితుడు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. అయితే భిక్షపతి ఏటీఎంలోకి వెళ్లక ముందు నుంచే నిందితులు ఏటీఎంలో అడ్డావేసి డబ్బులు వచ్చే మార్గంలో స్టీల్ క్లిప్‌ను అమర్చారు. కాని భిక్షపతికి ఆ డబ్బులు బయటకు కనిపించకపోవటంతో అతను కార్డు తీసుకుని వెళ్లిపోయాడు. అక్కడే తచ్చాడుతున్న ఇద్దరు నేరస్థులు భిక్షపతి బయటకు వెళ్లిన తరువాత స్టీల్‌క్లిప్ సహాయంతో పదివేల రూపాయలను తీసుకొని పారిపోయారు. ఏటీఎంలో సీసీ కెమెరాల పుటేజీలు, ఇతర ఆధారాలతో నిందితులను పోలీసులు పట్టుకుని కటకటాల్లోకి పంపించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

● నాడు తండ్రి, నేడు తల్లి మృతి ● అనాథలైన చిన్నారులు



ప్రహర్ష (ఫైల్)



అనాథలైన చిన్నారులు

మానకొండూర్, సెప్టెంబరు 23 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత వ్యవసాయబావిలో పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మానకొండూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ కర్రె స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ గ్రామానికి చెందిన కొండ్ర పవన్ కల్యాణ్ ఇదే గ్రామానికి చెందిన ప్రహర్ష ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె ఆద్యశ్రీ, కుమారుడు అయాన్స్‌లు జన్మించారు. కూలీ పని చేసుకుంటూ పిల్లలను పోషించుకున్నారు. పది నెలల క్రితం పవన్ కల్యాణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రహర్ష కరీంనగర్‌లోని ఓ షోరూంలో ఉద్యోగం చేస్తూ కుమారుడు, కుమార్తెను స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఒకటవ తరగతి, నర్సరీ చదివిస్తోంది. సోమవారం ఉదయం పిల్లలను తయారు చేసి పాఠశాలకు పంపిన ప్రహర్ష బహిర్భూమికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మామ లక్ష్మయ్య వెళ్లి చూడగా ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. ప్రహర్ష బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్న సమాచారంతో గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకొని విలపించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరకుకొని బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీయించారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లలను చూసి గ్రామస్థులు బోరున విలపించారు. మృతురాలి సోదరి ప్రసన్న ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. షోరూంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఏమైనా జరిగిందా లేదా మృతికి కారణాలపై అనుమానాస్పద స్థితిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి తెలిపారు. నాడు తండ్రి నేడు తల్లి మృతిచెందడంతో అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలను చూసి బంధువులు, గ్రామస్థులు తీవ్రంగా విలపించారు.

సమ్మిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, నాయకులు

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 23 : జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్లో తుమ్మేటి సమ్మిరెడ్డి పెద్దకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ దివంగత నేత ఎమ్మెస్సార్ మనువడు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు, నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌లతో కలిసి మంత్రి హాజరయ్యారు. సమ్మిరెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి, నాయకులు నివాళులు అర్పించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఈ ప్రాంత రైతాంగం అభివృద్ధి కోసం అహర్నిసలు కృషి చేసిన వ్యక్తి తుమ్మేటి అని కొనియాడారు. ఎమ్మెస్సార్ శిష్యుడిగా కాంగ్రెస్‌లో కొనసాగారని, అలాంటి వ్యక్తి ఆకస్మికంగా మరణించడం కాంగ్రెస్‌కు తీరని లోటు అన్నారు. అనంతరం మారుతినగర్‌లోని పిడుగు గట్టయ్య నివాసానికి వెళ్లారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.



కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ తోడు దొంగలే

- లాభాల వాటా చెల్లింపుల్లో కార్మికులకు అన్యాయం

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, సెప్టెంబరు 23: సింగరేణి కార్మికులను మోసం చేయడంలో నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డి ఇద్దరూ తోడుదొంగలేనని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ అన్నారు. సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులపై ప్రభాత్ తీవ్ర విమర్శలు చేశారు. గత ఆర్థిక సంవత్సరం రూ.4071కోట్లు లాభాలు వస్తే వివిధ ఖర్చుల పేర రూ.2,280కోట్లు పక్కన పెట్టి రూ.2,412కోట్లను మాత్రమే లాభాలుగా చూపెట్టి 33శాతం చెప్పుకుంటూ రూ.796కోట్లు పంపిణీ చేయడం మోసపూరిత చర్య అని ప్రభాత్ ఆరోపించారు. సంస్థ ఇతర అవసరాలకు వెచ్చించే రూ.2,280కోట్లు కార్మికులు సాధించిన లాభాల్లోవి కాదా అని ఆయన ప్రశ్నించారు. 35శాతం లాభాల వాటా డిమాండ్ చేస్తే 1శాతం మాత్రమే పెంచి ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులు గొప్పలు చెప్పుకునేందుకు సిగ్గుగా లేదా అని ప్రభాత్ ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికులు కూడా సింగరేణి లాభాల్లో తమ శ్రమను కూడా ధారపోశారని, లాభాల వాటారూ.5వేలు కాకుండా లాభాల్లో 20శాతం వాటా ఇవ్వాలని ప్రభాత్ డిమాండ్ చేశారు. ఆదాయ పన్నును కూడా సంస్థ నుంచి చెల్లించే విధంగా జనక్ ప్రసాద్, సీతారామయ్య బాధ్యత తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నికర లాభాల్లో నుంచి పక్కకు పెట్టిన రూ.2,289కోట్లను కార్మికుల ఆరోగ్యం, పిల్లల విద్య, కార్మికుల సొంతింటి పథకం అమలు కోసం, కార్మికుల ఐటీ చెల్లించేందుకు వినియోగించేలా ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులు జనక్ ప్రసాద్, సీతారామయ్య బాధ్యత తీసుకోవాలని ప్రభాత్ సూచించారు.

సీఎంపీఎఫ్ కుంభకోణంపై సీబీఐ విచారణ జరపాలి

బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

రామగిరి, సెప్టెంబరు 23: సింగరేణి బొగ్గు గని కార్మికుల సీఎంపీఎఫ్ వెయ్యి కోట్ల కుంభకోణం పై సీబీఐ విచారణ చేపట్టాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. సోమవారం ఆర్జీ-3,ఏపీఏ డివిజన్‌ల పరిధిల్లో వేర్వేరుగా నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల కష్టార్జితం దోచుకున్న వారి పై చర్యలు చేపట్టే వరకు న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదిన సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు మహాధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. అనంతరం పలు సంఘాల నుంచి నాయకులు బీఎంఎస్‌లో చేరాగా వాటి యూనియన్ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలోఆర్జీ-3 బ్రాంచీ ఇంచార్జి అరుకాల ప్రసాద్, నాయకులు రౌతు రమేశ్, వేణుగోపాల్‌రావు, మాదాసి రవీందర్, పాక కృష్ణ, మహేష్, సంతోష్, వెంకట సాయి, సంతోష్, అనిల్‌కుమార్, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు లాభాల్లో వాటా ఏఐటీయుసీ ఘనతే



సమావేశంలో మాట్లాడుతున్న వైపీ రావు

రామగిరి, సెప్టెంబరు 23: కార్మికులకు సింగరేణి లాభాల్లో వాటా ఇవ్వాలని తొలిసారిగా కోరింది ఏఐటీయూసీ యూనియన్ ఘనతేనని ఏఐటీయుసీ డిప్యూటి జనరల్ సెక్రటరీ వైపీ రావు అన్నారు. సోమవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. లాభాల వాటా పంపిణి విషయంలో కొన్ని కార్మిక సంఘాలు వారి ఉనికి కోసం కార్మికుల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. లేనిపోని ఆరోపణలతో ఏఐటీయుసీ అబాసు పాలుచేసే కుట్రలు చేస్తుందని, దీన్ని కార్మికులు గుర్తించాలని కోరారు. సమావేశంలో నాయకులు జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, శ్రీనివాస్, పోచం, వెంకటేశ్వర్లు, రాజయ్య, నరేష్, రామ్మూర్తి, లక్ష్మణ్, కనకయ్య, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో టీబీజీకేఎస్ నాయకుల నిరసన



కార్మికులకు నల్ల బ్యాడ్జీలు పెడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

గోదావరిఖని, సెప్టెంబరు 23: లాభాల వాటా చెల్లింపుల్లో ప్రభుత్వం, యాజమాన్యం సింగరేణి కార్మికులకు చేసిన మోసాన్ని నిరసిస్తూ సోమవారం టీబీజీకేఎస్ సింగరేణి వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా ఆర్‌జీ-1 పరిధిలోని బొగ్గు బావులు, ఓపెన్‌కాస్టులు, విభాగాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంత రం నికర లాభాలు రూ.4,70 కోట్లలో 33శాతం వాటా రూ.1550కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాల్లో టీబీజీకేఎస్ నాయకులు పర్లపల్లి రవి, చెల్పూరి సతీష్, వడ్డేపల్లి శంకర్, ఉప్పులేటి తిరుపతి, శ్రీనివాస్, ప్రసాద్, భాస్కర్, సత్యనారాయణ, ప్రవీణ్, రాజ్‌కుమార్, సుమన్, రాజేశ్, శ్రావణ్, తిరుపతి, అనిత, కీర్తన, లక్ష్మి, అంజయ్య, వెంకటస్వామి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులకు లాభాల వాటాలో కోత విధించడాన్ని నిరసిస్తూ సోమవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఆర్జీ-2 పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై నాయకులు కార్మికులకు నల్లబ్యాడ్జీలు పెట్టారు. ఈ సందర్భంగా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి మాట్లాడారు. ప్రతీ కార్మికుడు లక్ష నుండి రెండు లక్షల వరకు నష్టపోయేలా లాభాల్లో కోత విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. సింగరేణి నిధులను తరలిస్తే ఊరుకోబోమని రామ్మూర్తి హెచ్చరించారు. ఇప్పటికైనా కార్మికులు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక దోపిడీపై ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని, చూస్తు ఊరుకుంటే సంస్థ మనుగడ ప్రమాదంలో పడే అవకాశం ఉన్నట్టు రామ్మూర్తి పేర్కొన్నారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమాల్లో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఐ సత్యం, జేతి చంద్రయ్య, శ్రీనివాస రెడ్డి, సురేందర్, తిరుపతి, వెంకటేష్, శ్రీనివాస్, లింగారెడ్డి, కొంరయ్య, సంపత్‌రెడ్డి, రవి, రమేష్ పాల్గొన్నారు.

● మోసపూరిత లాభాల వాటా ప్రకటించారని ఓసీపీ-1లో టీబీజీకేఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశాయి. ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి సాంబయ్య మాట్లాడారు. లాభాల్లో నుంచి కొంత మొత్తాన్ని సంస్థ విస్తరణకు కేటాయిస్తామని మాయమాటలు చెప్పడం కార్మికులను మోసగించడమేనని అన్నారు. వాస్తవ లాభాలను ప్రకటించి వాటా కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వీకేపీ పిట్‌కమిటీ ఎన్నిక

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 23: సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ వకీల్‌పల్లె గని పిట్‌కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం గని ఆవరణలో జరిగిన పిట్‌కమిటీ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు ప్రకటించారు. పిట్ సెక్రెటరీగా కే శ్రావణ్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీగా బాలకృష్ణ, షిఫ్ట్ ఇంచార్జిలుగా సంపత్, జగదీష్, ప్రేమ్, సాయికుమార్‌లతో పాటు మరో 17 మందిని కమిటీ బాధ్యులుగా ప్రకటించారు. అనంతరం కమిటీని గని మేనేజర్‌కు పరిచయం చేశారు. ఈకమిటీ యువకులతో కూడిన కమిటీని ఆయన అభినందించారు. ఈసమావేశంలో ఉల్లి మొగిలి, వినయ్, కుటం ప్రవీణ్, నరసింహ, రమేష్, నరహరి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రామగిరి, సెప్టెంబరు 23: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం సెంటినరీకాలనీలో గల సింగరేణి పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై పార్క్‌లో గల ఖాళీ స్థలంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. దీంతో పాటు పరిసరాలను సైతం శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు రఘుపతి, శ్రీనివాసులు, రాజారెడ్డి, రాజశేఖర్, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, ఐలయ్య, కళ్యాణ్‌చక్రవర్తి, గుర్రం శ్రీహరి, రాజేశం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, కోట రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిపెండెంట్‌లకు ఉత్తర్వుల అందజేత

రామగిరి, సెప్టెంబరు 23: సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలో పనిచేస్తు మెడికల్‌ఇన్వాలిడేషన్ అయిన 54 మంది డిపెండెంట్‌లకు సోమవారం ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ఉద్యోగ ఉత్తర్వులను అందజేశారు. అదే విధంగా అంతర్గత జూనియన్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ పోస్టుల ఖాళీలకు అభ్యర్థులకు నిర్వహించిన నియామక పరీక్షల్లో ఎంపికైన 8 మంది అభ్యర్థులకు స్థానిక ఎంవిటిసి శిక్షణ ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్‌వోటూ జీఎం సత్యనారయణ, మల్లన్న, గుర్రం శ్రీహరి, శ్రీనివాస్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న రామమూర్తి

గోదావరిఖని, సెప్టెంబరు 23: సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి సాధనలో కార్మికులు సరికొత్త రికార్డులు నెలకొల్పుతుంటే వారిని మోసం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అగ్రస్థానంలో నిలిచిందని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామమూర్తి అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్కరణల పేరిట కార్మికులను నిండా ముంచింది కాంగ్రెస్ పార్టీయేనని, ప్రైవేటీరణను ప్రోత్సహించి సింగరేణిని బీఐఎఫ్ఆర్‌లోకి తోసింది కూడా కాంగ్రెస్సేనని ఆయన ఆరోపించారు. 1.17లక్షల మంది కార్మికులతో కళకళలాడిన సింగరేణి సంస్థలో గోల్డెన్ హ్యాండ్ షేక్, వలంటరీ రిటైర్డ్‌మెంట్లు, డిస్మిస్‌ల పేరిట వేలాది మంది కార్మికుల ఉద్యోగాలు ఊడదీసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆయన చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు పన్నుల రూపేణ సింగరేణిని నుంచి తీసుకుంటూ సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి, కొత్త గనుల తవ్వకానికి అనుమతులు కూడా ఇవ్వడం లేదని రామమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని బొగ్గు గనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి హైదరాబాద్ కేంద్రంగా బీజేపీ ప్రభుత్వం ప్రారంభించిన వేలం పాటకు స్వాగతం పలికిన కాంగ్రెస్‌ను, అందుకు కారణమైన బీజేపీని కార్మికులు గమనించాలని ఆయన కోరారు. కాంట్రాక్టు కార్మికులు గతంలో చేసిన సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందం మేరకే ఐదు వేల రూపాయలు లాభాల వాటా ఇస్తున్నారని, ఇందులో ఎవరి గొప్పతనం ఏమీ లేదని రాంమూర్తి అన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు పోగొట్టిన ఘన చరిత్ర ఉన్న నాయకులే నేడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 2023-24 సంవత్సరంలో రూ.4,701కోట్ల నికర లాభాలు సాధించినప్పుడు కార్మికులకు రూ.1550కోట్లు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు నూనె కొమురయ్య, కేంద్ర అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, నాయకులు చల్లా రవీందర్‌రెడ్డి, పొలాడి శ్రీనివాసరావు, శేషగిరి, మహిపతిరావు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సంబరాలు



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 23: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.5వేల బోనస్ ప్రకటించడాన్ని హర్షిస్తూ సోమవారం ఫైవింక్లయిన్‌లోని సింగరేణి కార్మికుని విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు దీటి బాలరాజు మాట్లాడుతూ సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రిదని, కానీ కొంత మంది బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేకుండా లాభాలు ఎక్కువ వచ్చినా తక్కువ చూపుతున్నారని ఆరోపణలు చేస్తున్నారని, పదేళ్ల కాలంలో సింగరేణి ఉద్యోగుల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లంగుల రమేష్, జనగామ శ్రీనివాస్, కృష్ణ, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 23: జిల్లాలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ పెద్దపల్లి నందు 2024-25 విద్యా సంవత్సరం మిగిలి ఉన్న సీట్ల కోసం వాక్ ఇన్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28న ఉదయం 11 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ముందు విడతలలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆప్షన్స్ ఎంచుకొని నేరుగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ ఫామ్ మరియు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 25 నుండి 28 వరకు ప్రతి రోజున 11 గంటల లోపు ప్రభుత్వ ఐటీఐ పెద్దపల్లి నందు హాజరుకాగలరని తెలిపారు.

ఉద్యమ కళాకారుల జిల్లా అధ్యక్షుడిగా రమేష్

ముత్తారం, సెప్టెంబరు23: పెద్దపల్లి జిల్లా తెలంగాణ ఉద్యమ కళాకారుల జిల్లా అధ్యక్షులుగా అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కళాకారులు గోస్కుల రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కళాకారుల అధక్షులు ఎల్లా పోశెట్టి, తెలంగాణ ఉత్తమ కళాకారుల పోరం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు గుండాటి అయిలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనే రామేశం, పిట్టల రమేష్, రాజయ్యలు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశంతో అందుబాటులోకి పల్లె దవాఖాన



ఎలిగేడులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పల్లె దవాఖాన

ఎలిగేడు, సెప్టెంబరు 23: కలెక్టర్ ఆదేశంతో ఎలిగేడు మండల కేంద్రంలో పల్లె దవాఖాన అందుబాటులోకి వచ్చింది. ఎలిగేడు మండలంలో ఆగస్టులో కలెక్టర్ పర్యటించిన సందర్భంలో మండల కేంద్రంలో పల్లె దవాఖాన భవనం లేదని హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వెంటనే అందుబాటులో ఉన్న భవనాన్ని చూడాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టోర్ ఖాళీగా ఉందని అధికారులు ఆయన దృష్టికి తేగా ఆ భవనానికి మరమ్మతులు చేయాలని పీఆర్ ఏఈ జగదీశ్‌బాబును ఆదేశించారు. తక్షణమే కలెక్టర్ రూ.3లక్షలు మంజూరు చేయగా భవనం మరమ్మతు పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సోమవారం పీఆర్ఏఈ జగదీశ్‌బాబు, హైస్కూల్ హెచ్ఎం గంగ్ర దేవేందర్‌రావులు పనులు పరిశీలించారు. ఒకటి, రెండు రోజుల్లో అన్ని హంగులతో పల్లె దవాఖానా అందుబాటులోకి రానున్నదని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రామాలయ పూజారికి అర్చక రత్న అవార్డు

ఓదెల, సెప్టెంబరు 23: భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్ర రామాలయంలో పూజారి ఆరుట్ల నరసింహచారికి సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో అర్చకరత్న అవార్డును ప్రదానం చేశారు. గతంలో అర్చకులందరికీ జ్యోతిష్యం, ఆగమ పరీక్షలు నిర్వహించగా ఇందులో ఉత్తీర్ణత సాధించి ఆలయాల్లో ఉత్తమ సేవలు, నైపుణ్యంలో నిష్ణాతులైన వారందరినీ గుర్తించిన మేరకు తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రధాన అర్చకుడైన వేణుగోపాల దీక్షితులు, శ్రీకాళహస్తీశ్వర దేవస్థాన ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్ ఈ అవార్డులను అందజేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 200 మంది అర్చకులు వైదిక జ్యోతిష్య సమ్మేళనానికి హాజరుకాగా, ఈ అవార్డులు పొందిన వారిలో నరసింహచారి ఒకరు.

'మంత్రి శ్రీధర్‌బాబుపై నిరాధార ఆరోపణలు'

మంథని, సెప్టెంబరు 23: అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇనుముల సతీష్ వ్యవహారంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తి నిరాధారమైనవని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నేతలు నూకల బానయ్య, జనగామ నర్సింగరావు, మంథని సత్యం అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ శ్రీధర్‌బాబు నీతి వంతమైన పాలన అందిస్తున్నందునే ప్రజలు మంథని నుంచి ఆదరించి ఐదు సార్లు అసెంబ్లీకి పంపారన్నారు. ఇనుముల సతీష్ తమ పార్టీ అధికార ప్రతినిధి కాదన్నారు. సతీష్ దందాలకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. మంథని మధూకర్, వామన్‌రావు దంపతులు హత్య కేసుల్లో బీఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించలేదన్నారు. ఆరోపణలు ఉన్న వారిని ఎందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదన్నారు. సతీష్ బాధితులు ఎవరైనా ఉంటే స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు అధికారులు సూచిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పోలు శివ, కుడుదుల వెంకన్న, ఎరుకల ప్రవీణ్, అజీం, రాజశేఖర్, మధు, ప్రభాకర్‌రెడ్డి, సదువలిలు పాల్గొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖనంలో నోబెల్ విద్యార్థుల ప్రతిభ



చినజీయర్ స్వామి చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థిని హస్మిత

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 23: ప్రజ్ఞా వికాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో పెద్దపల్లి జిల్లా స్థాయిలో పెద్దకల్వల నోబెల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి చినజీయర్ స్వామి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో నోబెల్ పాఠశాలలో చదువుతున్న పెగడ అక్షర (వ్యాసరచన పోటీ), బి.హస్మిత (చిత్రలేఖన పోటీ)లో పాల్గొని జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. ఈసందర్భంగా చినజీయర్‌స్వామి మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో నోబెల్ పాఠశాల కరస్పాండెంట్ మోహన్‌రాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించడానికే కళోత్సవాలు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 23: విద్యార్థులు కళల్లో రాణించేలా ప్రోత్సహించడానికే కళోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు పేర్కొన్నారు. ఎస్సీఈఆర్టీ ఢిల్లీ వారు సమగ్రశిక్ష అభియాన్ తెలంగాణ తో కలిసి కళా ఉత్సవ్ అని వేదికను ఏర్పాటు చేశారన్నారు. ఈ మేరకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లా విద్యాశాఖ తరపున పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని డీఈవో పేర్కొన్నారు. ఆరు కళల్లో పోటీలు ఉంటాయని స్వర సంగీతం (గానం), వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్(నాటకం), దృశ్యకళ, సాంప్రదాయక కథ చెప్పడం వంటి అంశా లపై ప్రధాన పోటీలు ఉంటాయన్నారు. మొదట మండల స్థాయిలో ఈనెల 25,26 వ తేదీలను పోటీలు నిర్వహించి అక్కడ ప్రథమ స్థానం పొందిన వారికి జిల్లా స్థాయిలో 27,28 తేదీల్లో జరిగే పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు కళాశాల స్థాయిలో ప్రిన్సిపాల్ విద్యార్థులను ప్రోత్సహించి పోటీలలో పాల్గొనే విదంగా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్ సీడీఎంఏకు సరెండర్

మంథని,సెప్టెంబర్ 23: మంథని మున్సిపల్ కమీషనర్‌గా పని చేసిన గుట్టల మల్లిఖార్జునస్వామిని కమీషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడిమిస్ట్రేషన్ హైదరాబాద్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. బొల్లారం మున్సిపల్ మేనేజర్‌గా పని చేస్తున్న మల్లిఖార్జునస్వామిని 2023 డిసెంబరు 18న మంథని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. మున్సిపల్ పాలకవర్గం, కమిషనర్‌కు మధ్య సమన్వయ లోపాలు తలెత్తడంతో, మున్సిపల్‌లో చర్చనీయాంశంగా మారిన అక్రమ దందాలపై ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన సరెండర్ చేసినట్లు సమాచారం.

సంక్షిప్త సమాచారం..

కాల్వశ్రీరాంపూర్: సేంద్రియ ఎరువులతో భూసారం పెరుగుతుందని వినూత్న ఆగ్రోటెక్ ఎల్ఎల్‌పీ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోరండ్ల శివసాయి అన్నారు. సోమవారం మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో రైతులకు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు.

పెద్దపల్లి కల్చరల్: బసంత్‌నగర్ గ్రామానికి నిరుపేద యువతి ఫర్హీన్ వివాహం నిశ్చయం కాగా వివాహానికి లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి పాస్ట్ ప్రెసిడెంట్ సయ్యద్ వజహతుల్లా అయాజ్ ఆధ్వర్యంలో 68,800 రూపాయల ఆర్థిక సహాయం సోమవారం అందించారు.

కోల్‌సిటీటౌన్: విద్యార్థులు విద్యతో పాటు ఆత్మ రక్షణ, మనోధైర్యం కోసం మార్షల్ ఆర్ట్స్ వంటి విద్యలో రాణించాల్సిన ఎంతైనా ఉందని సింగరేణి సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి అన్నారు. సోమవారం గోదావరిఖనిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో పెద్దపల్లి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే టోర్నమెంట్ ఎంపికలు నిర్వహించారు.

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడూర్, రామారావుపల్లి తదితర గ్రామాల్లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పాల్గొన్నారు.

మంథని: టీఏవైఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బోగె రాజారాం 3వ వర్ధంతిని ఈనెల 25న మంథనిలోని నిర్వహిస్తామని తెలంగాణ అంబేద్కర్ సంఘం నేతలు నక్క రవి, రామగిరి కుమార్, జంజర్ల శ్రీనివాస్, నూకల బానయ్య, అప్పాల పోచమల్లయ్య, ఎడ్ల కిష్టయ్య, సింగారపు కిష్టయ్యలు సోమవారం తెలిపారు.

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామాన్ని టీ ఫైబర్ ఇంటింటికి ఇంటర్నెట్ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినందుకు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబును ముత్తారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని అప్పన్నపేటలో ఎస్సారెస్పీ కెనాల్ కాలువ డి-83 ప్రధాన కాలువ భూములను పరిరక్షించాలని గ్రామానికి చెందిన ఆడప గణేష్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో సోమవారం పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవేందర్, లచ్చయ్య, శ్రీనివాస్, చిరంజీవి, దాస్, రవి, నర్సయ్య పాల్గొన్నారు.

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఏరియాలో సోమవారం రాత్రి కార్పొరేట్ సీహెచ్‌పీల జీఎం తిరుమలరావు పర్యటించారు. అనంతరం ఏరియాలోని సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే చందర్ జన్మదినం

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 23: రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ జన్మదినాన్ని బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. చందర్ పిలుపు మేరకు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బీఆర్ఎస్ శ్రేణులు పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఫైవింక్లయిన్ బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో అమ్మ పరివార్ ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

తిలక్‌నగర్ బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక న్యూ అశోక్‌టాకిస్ వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. గంగనగర్ పట్టణ కమిటీ అధ్యక్షుడు అచ్చే వేణు ఆధ్వర్యంలో స్థానిక పోచమ్మ దేవాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. బీఆర్ఎస్ యువజన నాయకుడు చింటు పేద వృద్ధ మహిళలకు జ్యోతి గాంధీ ఫౌండేషన్ నిర్వహణ పాకెట్ మనీ అందించారు. 37వ డివిజన్‌లో అంగన్‌వాడి సెంటర్‌కు నాయకులు చెలకపల్లి శ్రీనివాస్, తాటికంటి తిరుపతి, మహేందర్‌రెడ్డి కూలర్‌ను అందించారు. బీఆర్ఎస్ నాయకురాలు ముద్దసాని సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గర్భిణులకు పండ్లు, బ్రెడ్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు బొడ్డు రజిత, రాకం లతదామోదర్, పాముకుంట్ల భాస్కర్, నాయకులు జేవీ రాజు, నారాయణదాసు మారుతి, బొబ్బిలి సతీష్, మాదాసు రామమూర్తి, పర్లపల్లి రవి పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ/పాలకుర్తి: మండలం పరిధిలోని బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ కార్మికులు, ఆటో స్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకుడు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 23: కాంగ్రెస్ పాలనలో అంబేద్కర్‌కు అనేక అవమానాలు జరిగాయని, రాహుల్ గాంధీ దేశ ప్రజలకు, అంబేద్కర్‌కు క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎస్సీ మోర్చా పెద్దపల్లి ఇన్‌చార్జి పానుగంటి మధు, కాశిపేట శివాజీ డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తివేస్తారని మాట్లాడడం రాజ్యాంగాన్ని తూట్లు పొడిచి నట్టేనన్నారు. 57సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఎందుకు భారతరత్న ఇవ్వలేదని ప్రశ్నించారు. వాజ్‌పేయి ప్రధాని అయిన తరువాత అంబేద్కర్‌కు భారత రత్న ఇచ్చారని వారు గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు పెద్దపల్లి రవీందర్, జక్కుల నరహరి, మూకిరి రాజు, మహవాది రామన్న, సుల్వ లక్ష్మీనర్సయ్య, కుంబాల రాజు, శివరాం, గోపగోని నవీన్, సునీల్ పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 23: మండలంలోని పెద్దంపేట్ గ్రామ పరిధి నందు పింగిలి శ్రీనివాస్‌రెడ్డి, తదితర రైతులు వరి పంటలను వ్యవసాయ అధికారి నాగార్జున సోమవారం పరిశీలించారు. వరికి అకు ఎండు తెగులు, బాక్టీరియా లీఫ్ బ్లైట్ బీఎల్‌బీ సోకినట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఏవో నివారణ చర్యలను సూచించారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు ఉన్నారు.

జిల్లా స్కౌట్స్, గైడ్ టెస్టింగ్ క్యాంప్ సందర్శన

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 23: గోదావరిఖని శారదానగర్ సరస్వతీ శిశుమందిర్‌లో కొనసాగుతున్న జిల్లా తృతీయ సోపాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ టెస్టింగ్ క్యాంప్‌ను సోమవారం రామగుండం మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య సందర్శించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ జెండాను ఆవిష్కరించి శిబిరంలో టెంట్స్‌ను, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవడం వల్ల సమాజంలో మంచి పౌరులుగా నిలబడేందుకు దోహదపడుతుందన్నారు. అందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిబిరంలో గోదావరిఖని, బసంత్ నగర్, పాలకుర్తి, రామగిరి, గర్రెపల్లి, ముత్తారం, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాలలోని పాఠశాలల నుంచి 99 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ హాజరయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శి జ్యోతి, స్టాఫ్ మెంబర్స్ ప్రమోదిని, అమరజ్యోతి వెంకటలక్ష్మి, సాయినిరంజన్, సుధాకర్, రవీందర్, భాస్కర్, కుమార్, నీలిమ, విజయ, రజిత, స్రవంతి, సునీత, స్వర్ణలత, రాజేశ్వరి, సరస్వతి శిశుమందిర్ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రాజు, కార్యదర్శి రఘుసింగ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 23: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను కార్మికులు ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్ అన్నారు. సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు కార్మికులు బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేసిందన్నారు. కార్మికవర్గ హక్కులను పెట్టుబడి దారులకు కట్టబెట్టి కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం చేసిందన్నారు. కార్మికవర్గ హక్కులకు ఉరి తాళ్లుగా మారిన లేబర్ కోడ్లను దేశ వ్యాప్తంగా కార్మికవర్గం, రైతాంగం వ్యతిరేకిస్తూ బ్లాక్ డేను పాటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాకమిటీ సభ్యులు సామనపెల్లి వెంకటస్వామి, నాయకులు మాంకాలి సురేష్ ,బొంకురి సాగర్, కుక్క అన్వేష్, బొంకురి శంకర్, సలిగంటి రాజేందర్, కిరణ్, గౌరయ్య కనకలక్ష్మి, స్వప్న, లలీత పాల్గొన్నారు.